క్లుప్తంగా

చెట్లు నరికినవారిపై చర్యలు తీసుకోండి

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో తాటి, ఈత చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లుకు గీతా కార్మికులు వినతి పత్రం అందజేశారు. చెట్లు తొలగించడంతో జీవనోపాధి కోల్పోయామని వివరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు పరశురాముడుగౌడ్, కల్వకుర్తి మండల కార్యదర్శి సురేష్‌గౌడ్, చెన్నగౌడ్, ప్రశాంత్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, గణేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పొగాకుపై అవగాహన



బిజినేపల్లి: పొగాకు వాడకం, వాటి ఉత్పత్తులతో కలిగే నష్టాలపై సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్దా, పాన్ మసాలా, గుట్కా, కొకైన్, పొగతాగడం వలన ఆర్థిక, శారీరక, ఆరోగ్య పరమైన నష్టాలు కలుగుతాయని ప్రదర్శన రూపకంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ తామర, ఆశోక్, గంగ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కళాజాతా బృందం, ప్రయాణికులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కల్వకుర్తిరూరల్: విద్యుత్ ఎంప్లాయిస్ టీ 27 కల్వకుర్తి సబ్‌డివిజన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శిగా వరప్రసాద్, కోశాధికారిగా కేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వాతిలు ఎన్నికయ్యారు. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి శ్రీధర్, జిల్లా నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాసులు, శ్రీధర్ చారి, శ్రీనివాసారాజు, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

ఏఓగా శ్రీకాస్

పెంట్లవెల్లి: మండల వ్యవసాయ అధికారిగా శ్రీవికాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది ఏఓకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

రుణమాఫీ చేయాలని ధర్నా

కొల్లాపూర్ రూరల్: రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ బన్సీలాల్‌కు అందజేశారు. రుణమాఫీ ప్రకటించి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా పెంట్లవెల్లి మండల సింగిల్‌విండో సొసైటీలో రుణాలు తీసుకున్నా రైతులకు మాఫీ కాలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మినుము పంటను పరిశీలించిన ఏఓ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు, బోడబండ తండాలో రైతులు సాగు చేసిన మినుము పంటను సోమవారం మండల వ్యవసాయ అధికారి చిన్న ఉస్సేన్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము పంటలో ప్రస్తుతం పెనుబంక, పొగకు, లద్దె పురుగు, సెనగ పచ్చ పురుగు, బుడిద తెగులు ఆశించిందన్నారు. పెనుబంక నివారణకు థయోమెతక ఆక్సం ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. లద్దె పురుగు నివారణకు ప్లైతర 350 మిల్లీ లీటరు ఎకరానికి పిచుకారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గెస్ట్ అధ్యాపక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేష్‌కు హైకోర్టు అందజేసిన ఆర్డర్ కాపీని అధ్యాపకులతో కలిసి ఆయన అందజేశారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు జేఎల్ రిక్రూట్‌మెంట్‌తో సంబంధం లేకుండా అతిథి అధ్యాపకులను మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం రూ.42 వేల జీతం అందించాలని కోరారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్‌ల సంఘం రాష్ట్ర నాయకులు బాలరాజు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల మేలు కోసమే సర్వే



అచ్చంపేటలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: అన్ని వర్గాల మేలు కోసమే ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహిస్తునట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం మూడోరోజు అమ్రాబాద్ మండలం మాచారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సర్వేపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి తాహసీల్దార్ శైలేంద్ర కుమార్, ఎంపీడీఓ వెంకటయ్య, గ్రామ కార్యదర్శులు ముచ్చం, భీముడు, నాయకులు మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, శ్రీనివాస చారి, రేణయ్య, తదితరులు పాల్గొన్నారు.

■ పెద్దకొత్తపల్లి మండలంలోని 33 గ్రామాలో సర్వే కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు.

■ అచ్చంపేటలో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు. అధికారులు సర్వేను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

■ నాగర్‌కర్నూల్ మండలం తూడికుర్తిలో సర్వేను ఎంపీడీఓ కోటేశ్వర్ పరిశీలించారు. 800 పైగా కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు.

■ లింగాల మండలంలోని సూరాపూర్, మగ్దూంపూర్‌లో సర్వేను నోడల్ అధికారి సీతారాంనాయక్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. ఎదురవుతున్న సమస్యల గురించి ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు.

■ తెలకపల్లితోపాటు గౌరారంలో ఎన్యుమరేటర్లు కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు.

■ వెల్దండ మండలంలోని గుండాల, చెదురుపల్లి, వెల్దండ తదితర గ్రామాల్లో సమగ్ర సర్వేను మండల ప్రత్యేక అధికారి ఖాజా నిజామ్‌అలీ పరిశీలించారు. మండలంలోని 32 గ్రామాల్లో 82 మంది ఎన్యుమరేటర్లు సర్వేచేస్తున్నట్లు తెలిపారు. 10 బృందాలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు తదితరులు ఉన్నారు.

■ తాడూరు మండల కేంద్రంలో సమగ్ర ఇంటింట కుటుంబ సర్వేను డీఆర్‌డీఓ ఓబులేష్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్, ఎంపీడీఓ బ్రహ్మచారిలు ఉన్నారు.



అమ్రాబాద్ మండలం మాచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



లింగాల మండలం మగ్దూంపూర్‌లో..



వెల్దండ మండలం గుండాలలో..

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాడుతాం

నాగర్‌కర్నూల్‌రూరల్: కార్మికుల సమస్యలపై నిరంతర పోరాడుతామని భారత్ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు మలిశెట్టి బాలరాజు అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ నుంచి అచ్చంపేట సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న నాగరాజు బీఎంఎస్ యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రకాష్‌గౌడ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఇసుక కొరతను తీర్చాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరతతో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేకుండా ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆరోపించారు. దుందుబీ వాగు వెంట ఇసుక క్వారీలలో ఇసుక మాఫియా ఆగాడాలు అధికం అయ్యాయని వివరించారు. రోజుకు వందల టిప్పర్ల ఇసుక హైదరాబాద్‌కు తరలిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, అశోక్, కార్మిక సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, బాలయ్య, రాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం మండల కమిటీ ఎన్నిక

కోడేరు: మండలంలోని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీను ఆధ్వర్యంలో మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సూర్యంపల్లి బిచ్చన్న, ప్రధాన కార్యదర్శి గంగాపురి విష్ణు, కోశాధికారిగా నీరటి కుర్మయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, బంగారయ్య, స్వామి, సాగర్, నారాయణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా శరీర అవయవదాతల సంఘ జిల్లా కన్వీనర్ జల్లి ఉదయ్ కుమార్ నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవిని సోమవారం మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్థివదేహాన్ని ఎలా దానం చేయాలో వివరాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. శరీరం మట్టిలో కలవకుండా అవయవదానం చేయాలన్నారు. వివరాలకు సెల్ నం: 9666150874 ను సంప్రదించాలని కోరారు . కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మహిత, సూపరిండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మౌలానా అబుల్‌కలాంకు ఘన నివాళి



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న ముస్లింలు



కల్వకుర్తిలో నివాళులర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల, జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క్లాస్‌మెట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు రమణ, కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ సుప్రజాత, క్లాస్‌మెట్ సభ్యులు రమణ, కిరణ్, శివ, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మౌలానా అబుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని సోమవారం జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, స్కూల్ ప్రిన్సిపాల్ యాదగిరి, కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానాఅబుల్ కలాం ఆజాద్ జయంతిని కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో జాతీయ విద్య దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిముదా బేగం, కౌన్సిలర్ శిరీష ఉన్నారు.

ఇళ్లను క్రమబద్ధీకరించాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని బీసీ కాలనీలో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో 25 సంవత్సరాల కిందట అప్పటి ప్రభుత్వం అర్హులకు 110 గజాల చొప్పున స్థలాలను కేటాయించిందన్నారు. ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నా ఇప్పటివరకు క్రమబద్ధీకరించలేదని పేర్కొన్నారు. నాయకులు ఆర్ శ్రీనివాసులు, కంది కొండ గీత, పాదిలరామయ్య, కొంపల్లి అశోక్, అంతటి కాశన్న, కురుమయ్య, బాలయ్య, సైదమ్మ, మురళి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లిలో కేంద్ర బృందం పర్యటన



మాట్లాడుతున్న సురేష్

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లిలో కేంద్ర బృందం సభ్యులు సోమవారం పర్యటించారు. కల్వకుర్తి మండలం జీడిపల్లి, లింగాల మండలం అంబడిపల్లి, నాగర్‌కర్నూల మండలం కుండలపల్లి గ్రామాలను 2021–22లో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన పథకంలో అప్పటి పార్లమెంట్ సభ్యుడు రాములు చేర్చారు. ఈ మేరకు సోమవారం సెంట్రల్ అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ బృందం సభ్యులు జీడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు గ్రామంలో చేపట్టిన వివిధ పనుల వివరాలు వాటికి నిధుల కేటాయింపు, వ్యయాలపై ఆరాతీశారు. నాలుగు రోజుల పాటు సమగ్ర సమాచారాన్ని సేకరించనున్నారు. సెంట్రల్ అకాడమిక్ మానిటరింగ్ కో ఆర్డినేటర్ సురేష్, అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి, మిషన్ భగీరథ డీఈ సంధ్యారాణి, ఎంపీడీఓ వెంకటరాములు, వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు నిబంధనలపై రైతుల ఆగ్రహం



కొనుగోలు కేంద్రం వద్ద రైతులు

కల్వకుర్తిరూరల్: ధాన్యం కొనుగోలు నిబంధనలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండలంలోని మార్చాల ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. గతంలో ఎన్నడు లేని విధంగా ప్యాడీక్లీనర్‌లో వడ్లను పోసి వచ్చిన వడ్లనే కొనుగోలు చేస్తామనడం సరికాదని వాపోయారు. ప్యాడీ క్లీనర్‌లో వడ్లు పోస్తే తమకు నష్టం చేకూరుతుందన్నారు. తాలు పోవడంతో పాటు వడ్ల దెబ్బతింటాయన్నారు. కొనుగోలు కేంద్ర నిర్వాహకుడు రామకృష్ణను వివరణ కోరగా ప్యాడీ క్లీనర్ ద్వార వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. తేమ శాతం 14 వరకు ఉండాలని నిబంధనలు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో కొల్లే ఈశ్వర్, వినోద్‌రెడ్డి, మల్లయ్య, కరీం, సికిందర్, ఎల్లస్వామి, రంజిత్‌కుమార్, జహంగీర్, అశోక్‌రెడ్డి, రమేష్, యాదగిరి, లావణ్య, సునీత, పర్వీన్‌బేగం, నస్రీన్ బేగం, హస్సీన, శారద పాల్గొన్నారు.



పెద్దకార్పాముల ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో ..

అచ్చంపేట రూరల్: రైతుల పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పల్కపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం..

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, గోపులాపూర్, పెంట్లవెల్లి గ్రామాల్లో ఐకేపి మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2320 లు, సాధారణ రకానికి రూ.2300 ల మద్దతుధర ఇస్తుందన్నారు. మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ భీంరెడ్డి, నాగిరెడ్డి, రామన్‌గౌడ్, ఏపీఎం గౌస్‌ద్దీన్, మాజీ సర్పంచ్ గోపినాయక్, బాలరాజు, గోపాల్, రవి, శ్రీనులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

వెల్దండ: మండలంలోని బండోనిపల్లి గ్రామానికి చెందిన సరోజకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.16 వేల చెక్కు మంజూరు అయ్యింది. ఈ మేరకు సోమవారం హైదరాబాదులో బాధిత కుటుంబానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి చెక్కు అందజేశారు.

కలెక్టరేట్ ఎదుట వీఓఏలు దీక్ష



నాగర్‌కర్నూల్‌రూరల్: సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వీఓఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజుకుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట 48 గంటలపాటు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాజుకుమార్ మాట్లాడుతూ వీఓఏలకు అందించాల్సిన కమిషన్ ఉన్నతాధికారులు తీసుకుంటున్నారని ఆరోపించారు. వీఓఏలకు రూ.20 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి సుమలత, గౌరవ అధ్యక్షుడు పర్వతాలు, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత, జిల్లా నాయకులు ఆర్ శ్రీనివాస్, రామయ్య, అంజయ్య, దేవన్న, మల్లేష్, రామస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

పత్తి రైతుల రాస్తారోకో



చారకొండ: సీసీఐ నిబంధనలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తు మండలంలోని మర్రిపల్లి సమీపంలో కల్వకుర్తి–దేవరకొండ ప్రధాన రహదారిపై సోమవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీసీఐ నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుకు గిట్టుబాటు ధర రావడం లేదని ఆరోపించారు. తేమ, బరువు పేరుతో తూకాల్లో కోతలు విధిస్తున్నారన్నారు. రెండు గంటల పాటు రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో అయా గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



వెల్దండ: దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎంజీకాలనీతండావాసులు సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈనెల 8వ తేదీన వ్యవసాయ పొలంలో తండాకు చెందిన రాత్లవత్ రాజు దారుణహత్యకు గురయ్యాడు. సోమవారం మృతుడి భార్యతోపాటు మరో ఇద్దరు అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. దీంతో తండావాసులు స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో చేరుకొని నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ కురుమూర్తిలను కోరారు. హైదరాబాదు–శ్రీశైలం రోడ్డుపై బైఠాయిస్తుండగా వారిని శాంతింపజేశారు.

కలెక్టర్‌పై దాడి అమానుషం

అచ్చంపేట: విధి నిర్వహణలో ఉన్న వికరాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై రైతుల పేరుపై దాడి చేయడం అమానుషమని టీఎన్‌జీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహీరొద్దీన్ పేర్కొన్నారు. కలెక్టర్‌తో పాటు కొండగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండించారు. ఇందుకు నిరసనగా ఈనెల 12న మంగళవారం తెలంగాణ ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలుపుతామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు అధికారులను నిలదీసిన రైతులు

అచ్చంపేట రూరల్: బ్యాంకులలో దళారులే రాజ్యమేలుతున్నారని...అసలైన రైతులకు క్రాప్ లోన్లు ఇవ్వడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని సింగారం రైతులు, గ్రామస్తులు బ్యాంకు అధికారులను నిలదీశారు. సోమవారం గ్రామంలో మహిళా సంఘాలు, ఖాతాదారులు, రైతులకు అచ్చంపేట ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను చెల్లించాలని, సకాలంలో రెన్యూవల్ చేసుకోకపోతే జరిగే నష్టాలను బ్యాంకు అధికారులు వివరించారు. కాగా కొంతమంది ఖాతాదారులు మాట్లాడుతూ.. బ్యాంకు వద్దకు వెళితే వివిధ కొర్రీలు చెబుతూ ఎలాంటి పనులు చేయడం లేదని, మధ్య దళారులు వస్తే వెంటనే పనులు చేస్తున్నారని ఆరోపించారు. స్పందించిన బ్యాంకు అధికారులు మాట్లాడుతూ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు నేరుగా రుణాలు అందిస్తామన్నారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

చారకొండ: మండల కేంద్రానికి చెందిన చింతపల్లి నిర్మలమ్మపై అకారణంగా దాడి చేసి గాయపర్చిన అదే గ్రామానికి చెందిన కాటమయ్యపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శంషోద్దీన్ తెలిపారు. ఆదివారం నిర్మలమ్మ తమ పొలానికి వెళ్లగా అక్కడే ఉన్న బావ కొడుకు కాటమయ్య అకారణంగా దూషించి కొట్టి గాయపర్చాడు. బాధితురాలు నిర్మలమ్మ ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలకార్మికుడి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: బాలకార్మికుడి అదృశ్యమైన ఘటనలో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 7న అచ్చంపేట నుంచి బాలల సంరక్షణ అధికారులు బాలకార్మికుడిని అనాథ ఆశ్రమంలో చేర్పించారు. ఈనెల 9న బాల కార్మికుడు అనాథ ఆశ్రమం నుంచి ఎవరికి చెప్పకుండా పారిపోయాడు. అనాథ ఆశ్రమ సిబ్బంది భూపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే విషయంలో ప్రతి పక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేపై ప్రతిపక్షాల నాయకులు ప్రజలను భయాందోళనలకు గురి చేయడం సరికాదన్నారు. ఉనికిని కాపాడుకునేందుకే ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



బిజినేపల్లి: మండలంలోని పాలెంలో సోమవారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కోరవి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణ క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు జయంత్, చక్రపాణి, ఈఓ సీహెచ్ రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కార్తీక పూజలు

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో కార్తీక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయం ప్రాంగణంలో భక్తి గీతాలన ఆలపించారు. భక్తులు సహపంక్తి ఫలహారాలు, భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరం పాలకమండలి సభ్యురాలు సంబు శోభ, రుక్మిణి మహిళలు సంఘం సభ్యులు జయమ్మ, దీపిక, మంజుల, ప్రభావతమ్మ, సరస్వతి, పద్మజ, లక్ష్మమ్మ, ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కోడేరు: మండలంలోని జనుంపల్లిలో సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని డీవైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి శివశంకర్, వరప్రసాద్, శ్రీను, ధర్మేందర్, శివరాజు పాల్గొన్నారు.